క్లుప్తంగా

కల్లుగీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బత్తయ్యగౌడ్



బత్తయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కల్లుగీత కార్మికుల సంఘం అధ్యక్షులుగా త్రిపురాంజి బత్తయ్యగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తిరకాల పురుషోత్తంగౌడ్, ఉదయగిరి మోహన్‌గౌడ్, అత్తిరాల శ్రీరాములు గౌడ్, జడపల్లి మునిశేఖర్‌గౌడ్, అరగొండ భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముదిరాజుల ఆత్మీయ పలకరింపు



ముదిరాజుల కులస్తులతో సంఘం ప్రతినిధులు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం, కుర్రకాల్వ, కరంబాడి, దొడ్లమిట్ట, బీసీ కాలనీలో ఆదివారం ముదిరాజుల ఆత్మీయ పలకరింపు కార్యక్రమాలు నిర్వహించారు. ముదిరాజులందరినీ ఏకం చేసి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ముదిరాజ్ సంఘం శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షుడు కన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత, సంఘం గౌరవ సలహాదారు తోటకూర కోటేశ్వరరావు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రికెట్ కిట్ అందజేత



విద్యార్థులకు క్రికెట్ కిట్ అందజేస్తున్న హరికృష్ణ

ఏర్పేడు: మండలంలోని పల్లం ఎస్సీ వసతి గృహం విద్యార్థులకు ఆదివారం క్రికెట్ కిట్ అందజేశారు. పల్లం గ్రామానికి చెందిన హరికృష్ణ తమ కుమారుడు జన్మదినం సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు కిట్‌ను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చేనేత సంఘం సభ్యులు


ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆదివారం చేనేత సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 18 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు చేనేత సంఘం కమిటీ సభ్యులు తెలిపారు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి సన్నిధి వద్ద ధ్వజావరోహణ పూజలు నిర్వహించారు. దీంతో ఆడికృత్తిక ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



ఊరేగుతున్న స్వామివారు



ఇక్కడ చిత్రంలో గూడలవారిపాళెం రోడ్డు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చెందింది. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో మంజూరైన రూ. 2.50కోట్లతో 7.5కి.మీల మేరకు బీటీ రోడ్డుగా రూపురేఖలు ఇలా సంతరించుకుంది. గతంలో ఈ మార్గం 7.5కి.మీ మేరకు పూర్తిగా గుంతలమయం కావడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడేవారు. సమస్య ఎమ్మెల్యే దృష్టికి రావడంతో ఆయన ప్రభుత్వానికి నివేదించి అభివృద్ధి చేయించారు.



మండలంలోని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం నూతన హంగులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 1.87కోట్లతో నిర్మించిన భవనమిది. ఇక్కడ సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు చెందిన ఆరు ఉపకేంద్రాల పరిధిలో 40వేల పైచిలుకు జనాభాకు వైద్యసేవలు అందివ్వడానికి ఇది ఇది సిద్ధమైంది. ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తోంది.

అభివృద్ధి రయ్..రయ్!



నాడు-నేడుతో అభివృద్ధి చెందిన నెల్లటూరు ప్రాథమికోన్నత పాఠశాల



తొండంబట్టు-సిద్ధాపురం మార్గంలో కొత్తగా వేసిన తారు రోడ్డు



సాతంబేడులో వేసిన సిమెంటు రోడ్డు

- మండలంలో రూ. 27.86 కోట్లతో అభివృద్ధి పనులు
- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- శరవేగంగా నిర్మాణ పనులు
- సిమెంటు రోడ్ల నిర్మాణంతో కాలనీలు కళకళ

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తోంది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ముంగిటకే సేవలు అందివ్వడంతోపాటు గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించింది. గతంలో ఎవరూ చేయని విధంగా స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రత్యేక చొరవ చూపారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండలంలో 13 గ్రామ సచివాలయాల పరిధిలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలంలో రూ. 27.86కోట్లతో చేస్తున్న అభివృద్ధి పనుల్లో దాదాపుగా 80శాతం పూర్తయ్యాయి. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ఇక ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సీసీ రోడ్లు, తారు రోడ్లు, త్వరితగతిన పూర్తి చేసుకోవడంతో అభివృద్ధి పరుగులు తీస్తోంది.

ఎమ్మెల్యే ఆదిమూలం చొరవతో రోడ్డుకు మోక్షం



రోడ్డు గుంతలమయమై దుస్థితికి చేరి చాలా కాలమైనా గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే ఆదిమూలంను కలసి రోడ్డు గురించి చెప్పగానే ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించారు. కరోనా కారణంగా కొంత ఆలస్యం అయినా రోడ్డు పనిని అధికారులు, కాంట్రాక్టర్ చొరవతో పనులను పూర్తి చేయించారు.తద్వారా కడూరు కూడలిలోని వరదయ్యపాళెం-తడ ప్రధాన రోడ్డు మార్గం నుంచి నెల్లటూరు మీదుగా గూడలవారిపాళెం వరకు తారురోడ్డు వేయడంతో వాహనదారులకు ప్రయాణం ఎంతో సులువుగా ఉంది. – చంద్రారెడ్డి, సర్పంచ్, గూడలవారిపాళెం

ప్రయాణం సుఖవంతం



మండలంలోని తొండంబట్టు-సిద్ధాపురం రోడ్డు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 3.75కోట్లతో 5.5కి.మీల దూరం బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసింది. ఈ రోడ్డు కారణంగా పెద్ద పాండూరు నుంచి తొండంబట్టు, ఎంజీనగర్, సిద్ధాపురం, రేపల్లెవాడ హెచ్‌డబ్ల్యూ గ్రామాల వారు సుఖవంతంగా రాకపోకలను సాగిస్తున్నారు. – రమ, సర్పంచ్, తొండంబట్టు గ్రామ పంచాయతీ

మండలంలో అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు

సచివాలయాలు	13	రూ. 4.45కోట్లు
ఆర్బీకేలు	12	2.61కోట్లు
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	10	1.75కోట్లు
జీజీఎం	67 పనులు	2.60
కోట్లుగూడలవారిపాళెంకు తారు రోడ్డు	7.5కి.మీ	2.50కోట్లు
తొండంబట్టు-సిద్ధాపురానికి తారు రోడ్డు	5.5కి.మీ	3.75కోట్లు
గ్రామీణ నీటి సరఫరా (జలజీవన్ మిషన్)	15 పనులు	1.57కోట్లు
చిన్న పాండూరు పీహెచ్‌సీకి నూతన భవనం	1	1.87కోట్లు
సంతవేలూరు నుంచి సాతంబేడుకు	సీసీ రోడ్డు	60లక్షలు
వరదయ్యపాళెం నుంచి సంతవేలూరుకు తారు రోడ్డు (రెన్యువల్)	12కి.మీ	2కోట్లు
నాడు-నేడు స్కూల్స్ (మొదటి, రెండవ విడత)	53	7.81కోట్లు
మొత్తం		రూ. 27.86కోట్లు

గరికపాటి రామచంద్రయ్య సేవలు చిరస్మరణీయం



అన్నదానం చేస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి క్షేత్ర ప్రాశస్త్యాన్ని దశదిశలా వ్యాప్తి చేయడంలో గరికపాటి రామచంద్రయ్య సేవలు చిరస్మరణీయమని ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. గరికపాటి రామచంద్రయ్య ఏడవ వర్ధంతిని పురస్కరించుకుని బాబుఅగ్రహారం వద్ద వారి కుమారులు గరికపాటి రమేష్‌బాబు, గరికపాటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దీనికి అంజూరు శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రామచంద్రయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మరో ముఖ్యఅతిథి, బీజేపీ నాయకులు కోలా ఆనంద్ మాట్లాడుతూ గరికపాటి రామచంద్రయ్యను ఆదర్శంగా తీసుకుని శ్రీకాళహస్తి క్షేత్ర మహత్యాన్ని దశదిశలా వ్యాప్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీకుమార్, వాసుయాదవ్, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

నల్లగంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకారంలో నల్లగంగమ్మ అమ్మవారు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేట తెట్టు ప్రాంతంలోని నల్లగంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆడినెలను పురస్కరించుకుని 108 దుత్తలతో అమ్మవారికి పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పొంగళ్లు పెట్టుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. చైర్మన్ కంఠా రమేష్, సభ్యులు నారాయణ, ప్రదీప్, అనిల్, దిలీప్, రాజేంద్ర, కపిల్, పూజారి శంకరయ్య, రాజేష్ గురుకుల్, గుణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



సూత్రనేతి ప్రక్రియను సాధన చేస్తున్న అభ్యాసకులు

శ్రీకాళహస్తి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు మార్కండేయులు అన్నారు. పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో నిర్వహిస్తున్న ఉచిత యోగాశిక్షణలో భాగంగా ఆదివారం ఉదయం సూత్రనేతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబ్బర్ ట్యూబ్ ద్వారా ముక్కు రంధ్రం నుంచి నోటిలోకి పంపి శుభ్రం చేసుకునే కార్యక్రమాన్ని సూత్రనేతి అని అంటారని చెప్పారు. దీనివల్ల దీర్ఘకాలిక జలుబు, ముక్కుకు సంబంధించిన అనేక ఇబ్బందులు తొలగుతాయన్నారు. గొంతులో పేరుకుపోయిన కఫం శుభ్రం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అభ్యాసకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మునిశేఖర్

ఏర్పేడు: స్థానిక వినాయక స్వామి ఆలయం వద్ద ఈ నెల 15న జరిగే రక్తదాన, ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని యువ సమాజ్ నిర్మాణ్ సేవా సంస్థ డైరెక్టర్ మునిశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వినాయక స్వామి ఆలయం వద్ద రక్తదాన శిబిరం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివిధ రకాల సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యువ సమాజ్ నిర్మాణ్ సేవా సంస్థ ప్రతినిధులు హరీష్, అశోక్, శివ, యశ్వంత్ పాల్గొన్నారు.

రైతులకు వంగనారు పంపిణీ



రైతులకు వంగనారు పంపిణీ చేస్తున్న కేవీకే చైర్మన్ వెంకటరత్నం

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ వనస్థలిలో ఆదివారం రైతులకు అంటుగట్టిన వంగనారును కేవీకే చైర్మన్ వెంకటరత్నం చేతుల మీదుగా పంపిణీ చేశారు. కేవీకేలో ఆదివారం రైతులకు అంటుకట్టిన వంగసాగుపై అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి నాణ్యమైన కూరగాయ పంట దిగుబడులను పొందవచ్చని ఆయన తెలిపారు. అంటుకట్టిన వంగసాగు ద్వారా రెండేళ్ల వరకు పంట దిగుబడితోపాటు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కుప్పంకు చెందిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ రూపొందించిన అంటుకట్టిన వంగనారు మొక్కలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్, వెదురుకుప్పం, నింద్ర మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు నిర్మించరూ!



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణిలో మురుగు కాలువ లేక ఇళ్లలోని మురుగునీరు వీధుల్లోకి చేరుతుండడంతో పారిశుధ్యం సమస్యలు తలెత్తుతున్నాయి. మురుగు నీరు మూలాన దోమలు విజృంభిస్తున్నాయి. మురుగు కాలువలు నిర్మించాలని, పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా స్పందించి మురుగు కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నా భూమి-నాదేశం శిలాఫలకాల ఆవిష్కరణ



పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధి సిబ్బంది, కూలీలు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక, పాగాలి, సరస్వతికండ్రిగ గ్రామాల్లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆదివారం నాభూమి-నాదేశం శిలాఫలకాలను ఆవిష్కరించారు. నాభూమి-నాదేశం శిలాఫలకం వద్ద సిబ్బంది, కూలీలు రంగవల్లులు వేసి పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గంగాధరం, రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ గిడ్డయ్య, ఏపీఓ దేవరి, ఈసీ బాలాజీరావు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

స్నేహపూర్వకంగా క్రీడలు



క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: స్నేహపూర్వక వాతావరణంలో క్రీడా పోటీలు నిర్వహించుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం గోవర్ధనపురం హైస్కూల్ సమీపంలోని క్రీడా మైదానంలో మైనారిటీ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. తొలుత ఆయన కొంతసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులతో ముచ్చటించి మాట్లాడారు. ముస్లిం మైనారిటీకి చెందిన క్రీడాకారులు 12 టీమ్‌లతో నిర్వహించే టోర్నీని సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. టోర్నమెంట్ నిర్వాహకులు, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ అబ్దుల్, కార్యదర్శి లతీఫ్, మైనారిటీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ సిద్ధిక్, క్రికెట్ టోర్నమెంట్ ప్రథమ, ద్వితీయ నగదు బహుమతులను అందజేయనున్న స్వచ్ఛ్ రూరల్ డెవలప్‌మెంట్ అర్బన్ సంస్థ అధ్యక్షులు మావుడూరు మోహన్‌ను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, రాష్ట్ర దేవాంగ సంఘం అధ్యక్షుడు బొప్పన తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, శ్రీకాళహస్తీశ్వర ట్రస్టు బోర్డు మెంబర్ పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, సర్పంచులు దుద్దు వేణు, చంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

గోవర్ధనపురం గ్రామ దేవత గంగమ్మ అమ్మవారికి ఆదివారం గ్రామస్తులు అంబలి పోసి మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించరూ!

- టీటీడీ చైర్మన్‌కు సుమన్‌కుమార్ వినతి



కరుణాకర్‌రెడ్డితో సుమన్‌కుమార్

నారాయణవనం: సత్యవేడు నియోజకవర్గంలోని టీటీడీ ఆలయాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిని కోరినట్లు జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్ కుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం కరుణాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో సుమన్‌కుమార్ కలిశారు. పద్మావతీ అమ్మవారిని కల్యాణ వెంకటేశ్వరస్వామి వివాహమాడిన నారాయణవనం క్షేత్రాన్ని, పద్మావతీ అమ్మవారితో కలిసి వెంకన్న కొలిచిన సముదాయం అవనాక్షమ్మ ఆలయాన్ని, ఏకైక మత్స్యావతార ఆలయమైన నాగలాపురం వేద నారాయణస్వామి ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, భక్తులకు సౌకర్యాలను కల్పించి, ఎస్వీబీసీలో విస్తృ ప్రచారం చేయాలని కోరినట్లు సుమన్ చెప్పారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం





ధుని, షిర్డిసాయిబాబా విగ్రహం



నవగ్రహకలశాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో అరిగిలకండ్రిగలోని శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో 25వ వార్షికోత్సవం ముగిసింది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రుద్రాభిషేకం, అన్నదానం, లలితా సహస్ర నామార్చన, కుంకమపూజ, రాత్రి శ్రీ గురు చరిత్ర ప్రవచన కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పద్మావతిపురంలో గంగమ్మకు పొంగళ్లు



గంగమ్మకు పూజలు చేస్తున్న స్థానికులు

వరదయ్యపాళెం: మండలంలో ఇందిరానగర్ పంచాయతీ పద్మావతిపురంలోని గ్రామదేవత గంగమ్మకు ఆదివారం అంబలి పోసి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళలు ఊరేగింపుగా వచ్చి, పొంగళ్లు పెట్టి, ప్రసాదాలను సమర్పించారు. అమ్మవారి వేషధారణలో పలువురు మొక్కులు చెల్లించారు. స్థానిక సర్పంచ్ సల్లా వీరభద్రయ్య, మాజీ వైస్ ఎంపీపీ విక్రమార్కరెడ్డి, గ్రామపెద్దలు గోపి యాదవ్, సుధాకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, లోకయ్య శెట్టి, లక్ష్మీ నారాయణ, ధనంజయ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు



సిద్ధిరాజుకండ్రిగ శ్రీ సోమనాథేశ్వరాలయంలో నందీశ్వరునికి హారతి ఇస్తున్న అర్చకులు

పిచ్చాటూరు: మండలంలోని సిద్ధిరాజుకండ్రిగ శ్రీ గౌరీ సమేత సోమనాథేశ్వర ఆలయంలో ఆదివారం భక్తిప్రపత్తులతో మహా ప్రదోష పూజలు చేశారు. ఆలయంలో శ్రీ సోమనాథేశ్వరుని అభిముఖంగా ఉన్న నందీశ్వరునికి అర్చకులు పంచామృతాలతో అభిషేకించి, పలు రకాల పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. అనంతరం మహా హారతి సమర్పించారు. శివపార్వతుల ఉత్సవమూర్తుల ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు పర్యవేక్షించారు.

గంగమ్మ సారె ఊరేగింపు



ఊరేగింపులో గంగమ్మ సారె

నారాయణవనం: స్థానిక పురవీధుల్లో ఆదివారం గంగమ్మ సారెను ఊరేగించారు. బుధవారం బలిజ సంఘం నిర్వహించే గంగమ్మల జాతర సందర్భంగా సాంఘిక సంక్షేమ వసతి గృహం సమీపంలోని రజక కాలనీ నుంచి ఆదివారం ఉదయం ప్రతిమను తయారు చేసే పసుపు, కుంకమలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. సోమవారం సాయంత్రం వరకు వీధుల్లో ఊరేగిన పసుపు, కుంకుమలతో గంగమ్మ ప్రతిమను రజక కాలనీలో రూపుదిద్ది మంగళవారం రాత్రి సర్వ భూపాల వాహనంలో ఊరేగిస్తామని నిర్వాహకులు శరత్‌కుమార్, చలపతి తెలిపారు. బుధవారం రాత్రి అమ్మవారి నిమజ్జనం నిర్వహించి, భక్తులకు పసుపు, కుంకును పంపిణీ చేస్తామన్నారు.

మంత్రి ఆర్‌కే రోజా నివాళి



నివాళి అర్పిస్తున్న మంత్రి రోజా

రేణిగుంట: మండలంలోని గాజుల మండ్యంలో మల్లవరం కాంతమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం మంత్రి ఆర్‌కే రోజా పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. మంత్రి రోజాతోపాటు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరై వారి కుటుంబీకులను ఓదార్చారు. ఆమె కుమారులు మల్లవరం నరేంద్ర రెడ్డి, రాజేంద్రరెడ్డి, సురేంద్రరెడ్డి గ్రామంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జువ్వల ధనంజయరెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి, సర్పంచ్ గంగారి రమేష్, మాజీ సింగిల్‌విండో చైర్మన్ సిద్దాగుంట సుధాకర్‌రెడ్డి, నగేషం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.